# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక



**లంచగొండుల వివరాలు ఏసిబికి తెలపండి**

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఏసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలకు:

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైదరాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,



## ఢిల్లీలో కంపించిన భూమి..

ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో భూమి ఒక్కసారిగా కంపించింది. ఢిల్లీ -- ఎన్‌సీఆర్‌తో పాటు ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంపం తీవ్రత 9.50 పీఎం(మాగ్నిట్యూడ్ ఎర్త్‌క్వేక్)గా నమోదైంది. భూమి కంపించడంతో ఇళ్లు, ఆఫీసుల నుంచి జనం ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు. ఢిల్లీతో సహా పంజాబ్‌లోని నోయిడా, ఛండీగఢ్, లూధియానాలో భూకంపం ప్రకంపనలు రేపింది. పూంఛ్, శ్రీనగర్, ఉదమ్‌పూర్, జమ్ము కశ్మీర్‌లోనూ భూమి స్వల్పంగా కంపించింది. కొన్ని సెకన్ల పాటు తమ నివాసాలు ఊగిపోయాయని, ఇంట్లోని వస్తువులు కింద పడిపోయాయని.. తాము చాలా భయపడ్డామని కొందరు స్థానికులు తెలిపారు. అయితే.. భూకంపం కేంద్ర, తరంగాల ప్రభావం.. భూకంపం తీవ్రత గురించిన వివరాలు తెలియాల్సి ఉంది.


నల్లగొండ | సంపుటి:16 | సంచిక:80 | ఎడిటర్: సయ్యద్ పాష | 05-04-2026 ఆదివారము | పేజీలు :8 | వెల:1/-



## డ్రగ్స్ రాజధానిగా కేరళ : రాహుల్ గాంధీ





కేరళ : దేశంలోని ఇతర ప్రాంతాలలో మైనారిటీలపై దాడి చేసే వ్యక్తులతో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు సంబంధాలున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తన ఎన్నికల ప్రచారంలో శబరిమల అంశం గురించి ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడలేదని విమర్శించారు. బీజేపీ-ఎల్‌డీఎఫ్ మధ్య పొత్తు ఉందని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎల్‌డీఎఫ్‌లో ఎవరూ ఉండరని పేర్కొన్నారు. సీపీఎం పార్టీ తన ప్రధాన సిద్ధాంతంపై రాజీ పడుతోందని విమర్శించారు. కేరళలోని అలప్పుజలో జరిగిన బహిరంగ సభలో ఈ మేరకు ఎల్‌డీఎఫ్, బీజేపీపై రాహుల్ మండిపడ్డారు. అలాగే తనతో వేదిక పంచుకున్న మాజీ సిపీఎం నాయకుడు జి. సుధాకరన్ గురించి రాహుల్ గాంధీ ప్రస్తావించారు. "ఈ వేదికపై ఒక మాజీ సీనియర్ వామపక్ష నాయకుడు (సుధాకరన్‌ను ఉద్దేశించి) ఉన్నారు. ఆయన ఇక్కడ కూర్చోవడానికి ఒక కారణం ఉంది. ఆయన ఆలోచనలు అకస్మాత్తుగా మారి పోలేదు. ఒక రాజకీయ పార్టీలో చాలా ఏళ్లు పనిచేశారు. సుధాకరన్ అవకాశవాదంతో ఇక్కడికి కాలేదు. ఎల్‌డీఎఫ్‌లో ఏదో మార్పు జరగడం వల్లే ఇక్కడ ఉన్నారు. ఎల్‌డీఎఫ్ చాలా ఏళ్లుగా మాకు ప్రత్యర్థి గా ఉంది. మేము వారితో పోరాడాం. ఇకపైనా పోరాడుతూనే ఉంటాం. కానీ చాలా ఏళ్లుగా మేము విభేదించే కొన్ని భావజాలాలకు వారు అండగా నిలబడ్డారు. " అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎల్‌డీఎఫ్‌ను ఒక అదృశ్య హస్తం (బీజేపీ, మోదీని ఉద్దేశించి) నడిపిస్తోం దని, అదే సీపీఎంలోని నాయకులను, కార్యకర్తలను కలవరపెడుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ అదృశ్య హస్తం మతతత్వమైనదని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని అంగీకరించదన్నారు. ప్రజలను విభజిస్తుందని, ద్వేషాన్ని వ్యాపింపజేస్తుందని తెలిపారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, సీపీఎంల మధ్య ఉన్న సంబంధం కేరళలోని ప్రతి ఒక్కరికి తెలుసని అన్నారు. "లెఫ్ట్ ఫ్రంట్‌లోని చాలా మంది నాయకులు అవకాశవాదులు. కొంతమంది అవకాశవాద నాయకులు అధికారంలోకి రావడానికి ఏదైనా చేస్తారు. వారికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల నుంచి సహాయం అందినా పట్టించుకోరు. మరోవైపు, కొంతమంది ఎల్‌డీఎఫ్ కార్యకర్తలు సిద్ధాంతం కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నారు. వారు ద్రోహానికి, నిరాశకు, బాధకు గురయ్యారు. తమ పార్టీలో జరుగుతున్న పరిణామాల పట్ల చాలా కలత చెందుతున్నారు." అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీపైనా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. మోదీ తనపైనా, కాంగ్రెస్‌పైనా నిరంతరం మాటల దాడి చేస్తారని అన్నారు. అయితే, ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని ఎందుకు లక్ష్యంగా చేసుకోలేదని ప్రశ్నించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా తాను చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా రాహుల్ గుర్తుచేసుకున్నారు. తనపై 38 కేసులు నమోదైనప్పటికీ తాను కేంద్ర ప్రభుత్వం ముందు ఎన్నడూ వెనకడుగు వేయలేదని తెలిపారు. "నేను బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పోరాడుతాను. నాపై 38 కేసులు ఉన్నాయి. కేంద్రం నా ఇంటిని లాక్కుంది. నేను బెయిల్‌పై బయట ఉన్నాను. వారు నన్ను 55 గంటల పాటు విచారించారు. కానీ నేను ఎప్పుడూ కేంద్రంపై పోరాడడంలో వెనకడుగు వేయలేదు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిసారీ కాంగ్రెస్‌పై దాడి చేస్తారు. ఆయన కేరళ సీఎం విజయన్‌పై, ఆయన కుటుంబం ఎందుకు దాడి చేయరు?. మోదీ తన ప్రతి ప్రసంగంలో దేవుడు, మతం, దేవాలయాల గురించి మాట్లాడతారు. కానీ ఆయన కేరళకు వచ్చినప్పుడు ఎల్‌డీఎఫ్‌కు సహాయం చేయాలనే ఉద్దేశంతో అవన్నీ మర్చిపోతారు. నిజం ఏమిటంటే జాతీయ స్థాయిలో ఎల్‌డీఎఫ్ తనను ఎప్పటికీ సవాలు చేయదని మోదీకి తెలుసు. శబరిమల బంగారు దొంగతనం కేసు గురించి మోదీ ఎందుకు మాట్లాడలేదు" అని రాహుల్ పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో మైనారిటీలు విస్తృతంగా దాడులను ఎదుర్కొం టున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేరళకు చెందిన ఇద్దరు సన్యాసినులపై ఛత్తీస్‌గఢ్‌లో దాడి జరిగిందన్నారు. మణిపూర్‌లో చర్చిలను తగలబెట్టారని, ఈ పనులు చేస్తున్న వారితో ముఖ్యమంత్రి విజయన్‌కు సంబంధం ఉందని విమర్శించారు. ప్రధాని మోదీ, విజయన్ ఇద్దరూ చాలా కాలం అధికారంలో ఉన్న తర్వాత అహంకారులుగా మారారని, ప్రజలకు దూరమయ్యారని దుయ్యబట్టారు. కేరళ డ్రగ్స్ రాజధానిగా మారిందని, రాష్ట్రంలోని 75 శాతం వరి రైతులు అప్పుల్లో ఉన్నారని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో ఒక కీలకమైన కొబ్బరి పీచు పరిశ్రమ నాశనమైందని, దాదాపు 1.3 లక్షల మంది కార్మికులకు పని లేదన్నారు. అమెరికాతో భారత్ చేసుకున్న వాణిజ్య ఒప్పందాన్ని కూడా రాహుల్ ప్రస్తావించారు. ఈ డీల్ దేశంలోని చిన్న రైతులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆరోపించారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల దేశంలో ఇంధన, గ్యాస్ కొరత ఏర్పడవచ్చని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుమతి లేకుండా భారత్ ఏ దేశం నుంచీ చమురు కొనలేదని ఎద్దేవా చేశారు. చమురు, గ్యాస్ ఎక్కడ కొనాలో చెప్పడానికి అసలు డొనాల్డ్ ట్రంప్ ఎవరని ప్రశ్నించారు. దేశ డేటాను అమెరికాకు అప్పగించారని, దేశీయ ప్రయోజనాలకు హాని కలిగించే విధంగా వ్యవసాయ రంగాన్ని సరళీకరించారని మోదీ సర్కార్‌పై మండిపడ్డారు. ప్రధాని మోదీ ట్రంప్ ఆదేశాల మేరకే పనిచేస్తారని, రాబోయే నెలల్లో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు భారీగా పెరుగుతాయని అన్నారు..

## అమెరికాతో చర్చలకు నో చెప్పిన ఇరాన్..





ఇరాన్ : అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం ఆగే సూచనలు ఏమాత్రం కనిపించడం లేదు. ఒకవైపు భీకర యుద్ధం కొనసాగుతుంటే, మరోవైపు ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ, శాంతి చర్చలకు అడుగులు పడ్డాయి. అయితే, ఈ చర్చలు, శాంతి ఒప్పందం ముందుకు కదలడం లేదు. అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు పాకిస్తాన్, టర్కీ, ఈజిప్ట్ వంటి కొన్ని దేశాలు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమయ్యాయి. దీని ప్రకారం త్వరలో రెండు దేశాల మధ్య పాకిస్తాన్, ఇస్లామాబాద్ వేదికగా చర్చలు జరగాలి.కానీ, ఈ చర్చలకు ఇరాన్ అడ్డుచెప్పిందని సమాచారం. అమెరికా అధికారులతో చర్చించేందుకు ఇరాన్ అంగీకరించడం లేదు. అమెరికా డిమాండ్లు ఆమోదయోగ్యంగా లేవని, అందువల్ల అమెరికా అధికారులను కలవాలనుకోవడం లేదని ఇరాన్ అధికారులు పాకిస్తాన్‌కు తెలిపారు. దీంతో చర్చలు నిలిచిపోయాయి. ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరితే, హార్ముజ్ జలసంధి అందుబాటులోకి వస్తుందని భావించిన ప్రపంచ దేశాలకు ఇరాన్ నిర్ణయం ఇబ్బంది కరంగా మారనుంది. ట్రంప్ ఇటీవల చర్చల అంశంపై స్పందించారు. ఇరాన్‌తో చర్చల కోసం ఆసక్తిగా ఉన్నట్లు చెప్పారు. చర్చలు జరుగుతున్నప్పటికీ, యుద్ధం కొనసాగుతుందని తెలిపారు. అయితే, తాము చర్చల్లో పాల్గొనడం లేదని గతంలోనే ఇరాన్ ప్రకటించింది. అయినప్పటికీ, మధ్యవర్తుల ద్వారా చర్చలపై ఒప్పించారు. కానీ, ఇప్పుడు ఇరాన్ మాత్రం చర్చలకు దూరంగా జరిగింది. దీంతో తదుపరి చర్చలను పాకిస్తాన్ వెలుపల నిర్వహించాలని మధ్యవర్తిత్వ దేశాలు భావిస్తున్నాయి. చర్చల కోసం ఇరాన్‌కు అమెరికా 15 అంశాలతో ఒక ప్రతి పాదన పంపింది. దీన్ని ఇరాన్ తిరస్కరి ంచింది. ఈ ప్రతిపాదనలు ఆమోదయోగ్యం కాదని ప్రకటించింది. మరో వైపు ఇరాన్ కూడా కొన్ని ప్రతిపాదనల్ని అమెరికాకు పంపింది.

## క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ కైవసం..




హైదరాబాద్, : తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలి తాలు వెలువడిన నాటి నుంచి ఎంతో ఉత్కంఠ రేపిన మూడు మున్సి పాలిటీల్లో రెండింటి లెక్క తేలింది. క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం, ఖానాపూర్ మున్సిపాలిటీలను కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు అన్ని రకాల ప్రయత్నాలు చేశాయి. కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకునేందుకు ఏం చేయాలో అవన్నీ చేశాయి. కొనుగోళ్లు, కిడ్నాప్‌లు, కేసులు, ధర్నాలు, నిరసనలతో రాజకీయాన్ని రక్తికట్టించాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన ఫిబ్రవరిలోనే జరగాల్సిన ఈ 3 మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక.. దాదాపు నెలన్నర తరువాత ఎట్టకేలకు నేడు(శనివారం) జరి గింది. ఈ ఎన్నికల్లో రెండు మున్సిపాలిటీలను ప్రతిపక్ష బీఆర్ఎస్ కూటమి కైవసం చేసుకోగా.. ఖానాపూర్‌లో ఇంకా టెన్షన్ వాతావరణమే నెలకొంది. మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పీఠాన్ని బీఆర్ఎస్-సీపీఐ కూటమి కైవసం చేసుకుంది. చైర్ పర్సన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ గుడిసెల సంధ్యారాణిని ఎన్నుకోగా.. వైస్ చైర్ పర్సన్‌గా సీపీఐ అభ్యర్థి సరితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరోవైపు సరిపడా బలం లేని కారణంగా చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్ దూరంగా ఉంది. క్యాతనపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకోవడానికి 13 మంది సభ్యుల మద్దతు అవసరం. ఇక్కడ బీఆర్ఎస్-సీపీఐ లకు 14 మంది సభ్యుల బలం ఉంది. ఎక్స్అఫిషియో సభ్యులతో కలిపి కాంగ్రెస్‌కు 10 మంది మద్దతు ఉంది. దీంతో చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడానికి అవసరమైన మెజారిటీ లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్ని కకు దూరంగా ఉంది. ఇబ్రహీంపట్నంలోనూ ఇదే సీన్ రిపీట్ అయింది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ.. బీజేపీతో కలిసి ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. చైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్ రెడ్డిని ఎన్నుకోగా.. వైస్ చైర్‌పర్సన్‌గా బీజేపీ అభ్యర్థి శ్యామలను ఎన్నుకున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీలో మాత్రం ఇంకా ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. బీజేపీ కూటమి - కాంగ్రెస్ మధ్య వివాదం నేపథ్యంలో ఖానాపూర్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక రేపటికి వాయిదా పడింది. ఈ మేరకు అధికా రులు ప్రకటన విడుదల చేశారు. అధికారుల తీరుపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బలం లేకున్నా కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే బొజ్జుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధి కారులంతా కాంగ్రెస్ కండువా కప్పుకోవాలంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ ఫైర్ అయ్యారు. ఖానాపూర్ మున్సిపర్ చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి ఏడుగురు సభ్యుల మద్దతు అవసరం. బీజేపీ చైర్ పర్సన్ అభ్యర్థి మౌనికకు మద్దతుగా ఏడుగురు కౌన్సిలర్లు చేతులెత్తారు. అయితే, తమ అభ్యర్థి సత్యం కు మద్ద తుగా కూడా ఏడుగురు కౌన్సిలర్లు చేతులె త్తినట్లు కాంగ్రెస్ నేతలు ఆందోళనలకు దిగారు. ఇరు వర్గాల ఆందోళనలతో అధికారులు ఎటూ తేల్చలేక పోయారు. ఉన్నతాధికారులతో సంప్రదింపుల అనంతరం ఎన్నికను రేపటికి వాయిదా వేశారు. తెలంగాణలో 7 మున్సిపల్ కార్పొరేషన్లు.. 116 మున్సిపాలిటీలకు గత ఫిబ్రవరి 11వ తేదీన ఎన్నికలు జరుగగా.. 13న ఫలితాలు వెల్లడించారు. ఫిబ్రవరి 16వ తేదీన అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. వివాదాలు, సంఖ్యాబలం లేకపోవడం వంటి కారణాలతో మూడు మున్సి పాలిటీలకు మాత్రం ఎన్నిక నిర్వహించలేదు. దాదాపు నెలన్నర తరువాత క్యాతనపల్లి, ఇబ్రహీ ంపట్నం, ఖానాపూర్ మున్సిపాలిటీలకు శనివారం నాడు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించారు.

## బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్



యాదాద్రి భువనగిరి జిల్లా :బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం 14 సంవత్సరాల కిశోర బాలికలకు గర్భాశయ క్యా న్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకాల కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిశోర బాలికల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. 14 సంవత్సరాల వయస్సులో ఈ టీకా వేయించుకోవడం ద్వారా భవిష్యత్‌లో గర్భాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. అర్హత కలిగిన ప్రతి బాలిక ఈ టీకాను తప్పనిసరిగా తీసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను టీకా కార్యక్రమానికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని, సూపర్‌వైజర్లు శాంతాకుమారి, ప్రభాకర్, ఎంపీహెచ్‌ఏ వసంత, కవిత, డీఈఓ శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లా జైలులో ఉచిత వైద్య శిబిరం



నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం నల్లగొండ జిల్లా కారాగారంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కారాగారం పర్యవేక్షణ అధికారి కూన ఆనందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైదీల ఆరోగ్య పరిరక్షణకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో ఖైదీలకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా కారాగారం జైలర్ బాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమన్వయంతో కీలక పాత్ర పోషించారు. వైద్య శిబిరంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా. ఏసిహెచ్ పుల్లారావు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా. రమేష్, డా. సుబ్బారావు, డా. వి. వినోద్ కుమార్, డా. శంకర్, డా. విశ్వజ్యోతి, డా. రామచంద్ర, డా. జి. ప్రవీణ్, డా. భరద్వాజ్, డా. వంశీ, డా. శ్రీవాస్తవ వైద్య సేవలు నిర్వహించారు. జిల్లా జైలు మెడికల్ ఆఫీసర్ సట్టు కిరణ్ కుమార్, డిప్యూటీ జైలర్లు వెంకట్ రెడ్డి, సుబ్బరాజు, మెడికల్ సిబ్బంది సీతారామ్, లింగయ్య, అలాగే పోలీసు సిబ్బంది సైదులు, గిరిబాబు, సురేష్, రాంబాబు, కరుణాకర్, శ్రావణ్, జయప్రకాష్ రెడ్డి, గణేశ్, శ్రీకాంత్, కోటి పాల్గొన్నారు.

## బాసర ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలి-సీఎం రేవంత్



హైదరాబాద్,: బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు(శనివారం) సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. భక్తుల విశ్వాసా లను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచి ంచారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హను మంతరావు, ఉన్నతాధికారులు పాల్గొ న్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభి వృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ. 225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

## కొన్ని నెలలకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయి

న్యూఢిల్లీ:ముడి చమురు దిగుమతుల విషయంలో ఇరాన్‌తో ఎలాంటి చెల్లింపు సమస్యలూ లేవని భారత పెట్రోలియం, సహజ వాయువు శాఖ స్పష్టం చేసింది. భారతీయ చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) ఇరాన్ సహా విదేశీ సప్లయర్ల నుంచి నిరంతరాయంగా ముడి చమురును కొంటున్నాయని వెల్లడించింది. రాబోయే కొన్ని నెలల అవసరాలకు సరిపడా ముడి చమురు సప్లైలను భారత్ ఇప్పటికే నిర్ధారించుకుందని తెలిపింది.

## రాష్ట్ర ప్రజల సంపదను తరలిస్తున్నారు: ఎంపీ ఈటల



వరంగల్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీలు, ఫీజురీయింబర్స్‌మెంట్ సహా పలు అంశాలపై సీఎంకు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ప్రజల సంపదను రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని ఈటల రాజేందర్ ఆరోపణలు గుప్పించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజల సంపదను తరలిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఎన్నికల వేళ ఆరు గ్యారంటీలు- 66 హామీల పేరుతో ప్రజలను ఆయన మోసం చేశారని ఎంపీ ఈటల ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజానీకం గంపెడు ఆశలతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. చట్ట సభల్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూష ణలతో కాలం వృథా చేశారని మండి పడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో రూ. 600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని ఆగ్రహించారు ఈటల. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు ఎలా సాధ్యమవుతుందని ఎన్నికల వేళ అగినప్పుడు.. తాను చేసి చూపిస్తానని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే చేసి నట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. వేల కోట్ల విలువ చేసే భూములను ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సీఎం రేవంత్ అమ్ముకుంటున్నారంటూ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు.

## మన బిడ్డ సీఎం రేవంత్ రెడ్డి ఉండడంతో అత్యధిక నిధులు

మహబూబ్‌నగర్, : భవిష్యత్తులో మహబూబ్ నగర్ మహానగరంగా అవతరి ంచబోతుందని ప్ర భుత్వ విప్,ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాం పు కా ర్యాలయంలో ఏర్పాటు చేసిన విలే కరుల స మావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గడిచిన రెండేళ్ల కాలంలో అధికారంలోకి వచ్చిన ప్రజా పాలన ప్రభుత్వంలో మన బిడ్డ సీఎం రేవంత్ రెడ్డి ఉండడంతో అత్య ధిక నిధులు తీ సుకువచ్చి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. రూ 220 కోట్ల ని ధులతో తాగునీ టి ఇబ్బంది లేకుండా ప్రత్యేక పైప్లైన్ ఏర్పా టు చేయడంతో పాటు అవసరమైన ప్రాం తాలలో నీటి నిల్వ చేసేందుకు గాను ట్యాం కులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మెడికల్, ఎడ్యుకేషన్, రవాణా హబ్ లుగా రూ పాంతరం చెందింది ఎందుకు అడుగులు పడుతున్నాయని స్పష్టం చేశారు.

# దేశ టైమ్స్

## సంపాదకీయం

### వారి పరిస్థితి రోజువారీ కూలీల కంటే హీనంగా, దీనంగా మారిందంటే అతిశయోక్తి కాదు...

కూలికోసం, కూటికోసం పట్టణంలో బతుకుదామని పొట్ట చేతపట్టుకుని వచ్చే గిగ్ వర్కర్లకు అనుదినం కష్టాలే. ఎంత ఎదిగినా గొర్రె తోక బెత్తెడే అన్న చందంగా ఎంత కష్టపడినా చాలీచాలని వేతనం, ఒత్తిడితో కూడిన పని విధానం వారిని కుంగదీస్తున్నాయి. గిగ్ ఎకానమీ వృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నా, ఆ రంగానికి చెందిన కార్మికుల పట్ల యాజమాన్యాలదీ, ప్రభుత్వాలదీ చిన్నచూపే. వారి పరిస్థితి రోజువారీ కూలీల కంటే హీనంగా, దీనంగా మారిందంటే అతిశయోక్తి కాదు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకువచ్చే దిశగా, రాష్ట్రంలో పనిచేస్తున్న నాలుగు లక్షలమంది గిగ్ వర్కర్ల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం రూపుదిద్దిన గిగ్ వర్కర్ల నమోదు, సామాజిక భద్రత, సంక్షేమ బిల్లు స్వాగతించదగినది. త్వరలో చట్టరూపం దాల్చనున్న ఈ బిల్లు అమలులోకి వస్తే, ఇకపై నమోదు చేసుకున్న కార్మికులకు ఐడి కార్డుతోపాటు పింఛను, బీమా, ప్రసూతి ప్రయోజనాలు లభిస్తాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సంక్షేమ బోర్డు గిగ్ వర్కర్లకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. కార్మికులకు వేతనాలు చెల్లించని అగ్రిగేటర్లపై కొరడా ఝుళిపిస్తుంది. సమస్యల పరిష్కారంలో కార్మికులకు సహకరించడంతోపాటు అపిలేట్ అథారిటీని సైతం నియమించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేయడం హర్షణీయం.భారత ఆర్థిక వ్యవస్థకు గిగ్ కార్మికులు 'కనిపించని చక్రాలు' (ఇన్విజిబుల్ వీల్స్)గా అభివర్ణించడం కద్దు. కానీ వారి జీవితం మాత్రం చుక్కాని లేని పడవ లాంటిది. ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, వేతనంతో కూడిన సెలవులు, పనివేళలు లేకపోవడంతోపాటు పని ప్రదేశాల్లో వివక్ష, ఒత్తిడి గిగ్ వర్కర్లను కుంగదీస్తున్నాయి. పని లేని రోజున పస్తులు ఉండక తప్పడం లేదు. ఈ రంగంలో పనిచేస్తున్నవారిలో అధిక శాతం అవివాహితులే. పైగా ఇతర ప్రాంతాలనుంచి పట్టణాలకు వలస రావడంతో రేషన్ కార్డులకు సైతం నోచుకోవడం లేదు. గిగ్ వర్కర్లుగా పనిచేస్తున్న మహిళా కార్మికులకు భద్రత కరవైంది. మన దేశంలో గిగ్ వర్కర్ల పరిస్థితిలో ఎదుగూబొదుగూ లేదంటూ తాజా ఆర్థిక సర్వే సైతం కళ్లకు కట్టిన సంగతి గమనార్హం. నలభై శాతం మంది ఆన్‌లైన్ డెలివరీ వర్కర్ల వేతనం నెలకు 15వేల రూపాయలు లేదా అంతకంటే తక్కువేనని ఆందోళన వ్యక్తం చేస్తూ, వీరికి న్యాయమైన వేతనాలు, వెయిటింగ్ పీరియడ్ లో పరిహారంతోపాటు గంటకు లేదా ప్రతి పనికీ కనీస ఆదాయం ఉండాలంటూ పలు సూచనలు, సలహాలు ఇచ్చింది.గత పదేళ్లుగా గిగ్ ఎకానమీ దినదినాభివృద్ధి చెందుతోంది. గత ఏడాది ప్రపంచ గిగ్ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 47 లక్షల కోట్ల రూపాయలని అంచనా. కానీ, ఇందుకు మూలకారకులైన గిగ్ వర్కర్ల సంక్షేమంపట్ల పాలకులు కనబరుస్తున్న చిత్తశుద్ధి చాలా తక్కువ. ఈ దిశగా ముందుగా కళ్లు తెరిచిన ఘనత రాజస్థాన్ ప్రభుత్వానికి దక్కుతుంది. మూడేళ్ల క్రితమే గిగ్ వర్కర్ల కోసం పటుతరమైన చట్టాన్ని రూపొందించి, అమలు చేస్తోంది. ఆ తర్వాత కర్నాటక, జార్ఖండ్ రాష్ట్రాలలోను చట్టాలు రూపొందాయి. ఈ జాబితాలో తాజాగా తెలంగాణ చేరడం ముదావహం. సంఘటిత, అసంఘటిత రంగాలలో ఉద్యోగి- యజమాని సంబంధం లేకుండా స్వయంగా ఆదాయార్జన చేసేవారే గిగ్ వర్కర్లు అంటూ కేంద్ర ప్రభుత్వం ఒక సందర్భంలో నిర్వచనం ఘనంగానే చెప్పినా, వారి సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు ఎంతమాత్రం చాలవనే చెప్పాలి.ఆ మధ్య గిగ్ కార్మికులు జరిపిన మెరుపు సమ్మె అనంతరం నాలుక కరచుకుని, ముసాయిదా నిబంధనలకు రూపకల్పన చేసిన కేంద్రం వాటి అమలులో నత్తనడకన నడుస్తూండటం క్షమించరానిది. 2047 నాటికి మన దేశంలో ఆరుకోట్ల మంది గిగ్ కార్మికులు పనిచేస్తారని వీవీ గిరి కార్మిక కేంద్రం జరిపిన ఒక అధ్యయనంలో తేలింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభాతో అలరారుతున్న భారతదేశంలో ఆర్థికాభివృద్ధికి రానున్న కాలంలో గిగ్ వర్కర్లే కీలకపాత్ర పోషించనున్నారు.ఈ నేపథ్యంలో మిగిలిన రాష్ట్రాలు సైతం రాజస్థాన్, తెలంగాణ వంటి రాష్ట్రాలు చూపిన బాటలో నడుస్తూ, గిగ్ వర్కర్ల సంక్షేమంకోసం పటుతరమైన చట్టాలు రూపొందించి, అమలు చేయాలి. అంతకుమించి, రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్దదిక్కుగా గిగ్ వర్కర్ల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకత్వం నెరపాలి. ఇంటర్మీడియెట్ విద్యార్హతతోనే ఈ రంగంలోకి ప్రవేశిస్తున్న కార్మికులకు సామాజిక భద్రతతోపాటు నైపుణ్య శిక్షణ, డిజిటల్ అక్షరాస్యత కల్పించాలి. పది నిమిషాలలోపు డెలివరీ వంటి నిబంధనలను రూపుమాపి, కార్మికులకు రక్షణ కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాలదే.

## మందు తాగాలంటే భయపడాల్సిందే!

హైద్రాబాద్: మందుబాబులకు షాకింగ్ న్యూస్! త్వరలో మీ ఫేవరెట్ బ్రాండ్ల ధరలు చుక్కలు చూపించబోతున్నాయి. మద్యం తయారీ కంటే ప్యాకేజింగ్ ఖర్చులు తడిసి మోపెడవ్వడమే దీనికి ప్రధాన కారణం. ముఖ్యంగా బీర్ బాటిళ్లు, విస్కీ సీసాల తయారీకి వాడే గ్యాస్ ధరలు పెరగడంతో కంపెనీలు బెంబేలెత్తిపోతున్నాయి. ఎండలు ముదురుతున్న వేళ బీర్ల కొరత ఏర్పడే ఛాన్స్ కూడా ఉంది. అసలు ఈ ధరల పెరుగుదల వెనుక ఉన్న కారణాలు చూద్దాం..మద్యం తయారీలో ముడిసరుకు కంటే ఇప్పుడు ప్యాకేజింగ్ ఖర్చే కంపెనీలకు పెద్ద భారంగా మారింది. విస్కీ, బ్రాందీ లాంటి స్పిరిట్స్ ప్యాకేజింగ్ ఖర్చు 20% ఉంటే, బీర్ల విషయంలో ఇది ఏకంగా 40% వరకు ఉంటోంది. ఈ బాటిళ్లను తయారు చేసే గ్లాస్ ఫర్నెస్‌లు (కొలిమి) నిరంతరం మండాలంటే సహజ వాయువు (గ్యాస్) తప్పనిసరి. మన దేశం తన గ్యాస్ అవసరాల కోసం 40% వరకు ఖతార్‌పైనే ఆధారపడుతోంది. ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల గ్యాస్ సరఫరాకు ఆటంకాలు ఏర్పడి, అది నేరుగా గాజు బాటిళ్ల ఉత్పత్తిపై దెబ్బకొడుతోంది. ఫలితంగా బాటిళ్ల తయారీ ఖర్చు భారీగా పెరిగిపోయింది. ఇండియన్ మాల్ట్ విస్కీ అసోసియేషన్ అంచనా ప్రకారం, కేవలం గ్యాస్ ధరల పెరుగుదల వల్లే గాజు బాటిళ్ల ధర 15-20% పెరిగింది. దీనికి తోడు అంతర్జాతీయంగా షిప్పింగ్ ఛార్జీలు కూడా భారంగా మారాయి. దీంతో లాభాలు తగ్గకుండా చూసుకోవడానికి మద్యం కంపెనీలు ఒక్కో బ్రాండ్ మీద 10-15% ధరల పెంపును కోరుతున్నాయి. ఇక ముఖ్యంగా ప్రీమియం సెగ్మెంట్ మద్యం ధరల్లో ఈ మార్పు తక్షణమే కనిపించే అవకాశం ఉంది. అంటే, ఇకపై మీరు కొనే ప్రతి బాటిల్ లేదా పెగ్గు మీద అదనపు భారం పడటం ఖాయమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఏప్రిల్ నుంచి జూన్ మధ్య వేసవి తాపానికి బీర్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. అయితే ఈసారి గ్యాస్ లభ్యత తగ్గితే గాజు ఫర్నెస్‌లు పూర్తి సామర్థ్యంతో పని చేయలేవు. దీనివల్ల మార్కెట్‌లో బాటిళ్ల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ప్రస్తుతం పరిశ్రమలో ఏడాదికి సుమారు 12 నుంచి 13 కోట్ల బాటిళ్ల కొరత ఇప్పటికే ఉంది. అదనంగా అల్యూమినియం ధరలు కూడా 15% పెరగడంతో బీర్ క్యాన్ల ధరలు కూడా పెరగవచ్చు. ఇక డిమాండ్ ఎక్కువగా ఉన్న పీక్ సీజన్‌లో సరఫరా తగ్గితే వినియోగదారులు తమకు నచ్చిన బ్రాండ్లు దొరక్క ఇబ్బంది పడక తప్పదు. ఈ గండం నుంచి గట్టెక్కేందుకు కొన్ని కంపెనీలు ముందస్తుగా ప్లాన్ చేస్తున్నాయి. ఉదాహరణకు 'రాడికో ఖైతాన్' వంటి కంపెనీలకు సొంత పవర్ ప్లాంట్లు ఉండటం వల్ల ఇంధన ధరల అస్థిరత నుంచి కొంత ఊరట లభిస్తోంది. అలాగే 'అలైడ్ బ్లెండర్స్' తమ వద్ద ఒకటిన్నర నెలలకు సరిపడా బాటిళ్ల స్టాక్ ఉందని చెబుతోంది. ఇక ఏదేమైనా, అంతర్జాతీయ పరిణామాలు చక్కబడకపోతే మాత్రం సామాన్యుడి జేబుకు చిల్లు పడటం ఖాయం. ఒకవైపు పెరుగుతున్న ఎండలు, మరోవైపు మండుతున్న మద్యం ధరలతో ఈ వేసవి మందుబాబులకు కాస్త గట్టి పరీక్షే పెట్టబోతోంది. ఏది ఏమైనా పెరుగుతున్న ధరల కారణంగా మందుబాబులు ఇప్పుడు మద్యం తాగాలంటేనే భయపడే స్టేజికి వచ్చేస్తున్నారు అనడంలో సందేహం లేదు.

## ఉద్యోగులకు నెట్ శాలరీ తగ్గే ఛాన్స్!

న్యూఢిల్లీ:ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరికీ ఏప్రిల్ 1వ తేదీ అంటే కొత్త ఆశలు, జీతం పెరుగుదల గుర్తొస్తాయి. కానీ, 2026 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్న కొత్త కార్మిక కోడ్ ఇక మీకు మిశ్రమ ఫలితాలను ఇవ్వబో తున్నాయి. మీ గ్రాస్ శాలరీ పెరిగినా, నెలకు చేతికి వచ్చే 'నెట్ శాలరీ' మాత్రం తగ్గే అవకాశం ఉంది. అసలు ఈ కొత్త రూల్స్ ఏంటి? మీ జీతంపై ఇవి ఎలాంటి ప్రభావం చూపుతాయో క్లియర్ గా తెలుసుకుందాం ..కొత్త నిబంధనలు.. 50% బేసిక్ పే:కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త లేబర్ కోడ్ ప్రకారం, ఇకపై ఉద్యోగి బేసిక్ వేతనం వారి మొత్తం జీతంలో కనీసం 50 శాతం ఉండాలి. ఇప్పటివరకు చాలా కంపెనీలు బేసిక్ పేను తక్కువగా ఉంచి, అలవెన్సులను ఎక్కువగా చూపిస్తున్నాయి. కానీ కొత్త రూల్ ప్రకారం అలవెన్సులు 50 శాతానికి మించకూడదు. దీనివల్ల కాగితం మీద మీ బేసిక్ జీతం పెరిగినట్లు కనిపిస్తుంది కానీ, దానివల్ల కొన్ని కోతలు కూడా అంతే స్థాయిలో పెరుగుతాయి.పీఎఫ్ వాటా పెరుగుదల.. చేతికి తక్కువ:మీ బేసిక్ జీతం పెరిగితే ఆటోమేటిక్ గా మీ పీఎఫ్ కంట్రిబ్యూషన్ కూడా పెరుగుతుంది. నిబంధనల ప్రకారం బేసిక్ వేతనంలో 12 శాతం పీఎఫ్ ఖాతాకు వెళ్లాలి. బేసిక్ పే పెరగడం వల్ల మీ జీతం నుంచి కట్ అయ్యే పీఎఫ్ అమౌంట్ పెరుగుతుంది, అలాగే కంపెనీ ఇచ్చే వాటా కూడా పెరుగుతుంది. దీనివల్ల నెలాఖరున మీ బ్యాంక్ అకౌంట్లో పడే 'ఇన్-హ్యాండ్ శాలరీ' గతంలో కంటే తగ్గే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.గ్రాట్యుటీ మినహాయింపులు.. రిటైర్మెంట్ బెనిఫిట్స్:కేవలం పీఎఫ్ మాత్రమే కాదు, గ్రాట్యుటీ లెక్కలు కూడా మారిపోతాయి. బేసిక్ పే పెరిగినప్పుడు కంపెనీలు చెల్లించాల్సిన గ్రాట్యుటీ భారం కూడా పెరుగుతుంది. దీనివల్ల కంపెనీకి అయ్యే ఖర్చు పెరిగినా, ఉద్యోగికి తక్షణ ప్రయోజనం కంటే దీర్ఘకాలిక ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో రానున్న కొత్త పన్ను విధానాలు, అలవెన్సుల మార్పులు కూడా నెట్ శాలరీపై అదనపు ప్రభావం చూపే అవకాశం ఉంది.మొత్తానికి ఈ కొత్త కార్మిక కోడ్లు అమలులోకి వస్తే, ప్రస్తుతానికి మీ జేబులోకి వచ్చే డబ్బు తగ్గుతుంది. అయితే దీనివల్ల ఒక పెద్ద లాభం కూడా ఉంది. మీ పీఎఫ్ ఖాతాలో ఎక్కువ డబ్బు జమ అవ్వడం వల్ల రిటైర్మెంట్ సమయానికి మీకు అందే భారీ మొత్తం పెరుగుతుంది. అంటే ఇప్పుడు కొంచెం తక్కువ జీతంతో సర్దుకుంటే, భవిష్యత్తులో ఆర్థిక భరోసా ఎక్కువగా ఉంటుందన్నమాట. కాబట్టి ఈ మార్పులకు ఉద్యోగులందరూ మానసికంగా సిద్ధంగా ఉండటం మంచిది అంటున్నారు నిపుణులు.

## ఈ నెల 7న "బస్ భవన్ బచావో" కార్యక్రమం..



హైదరాబాద్, : ఆర్టీసీ సంస్థ తరఫున బస్ భవన్‌ను నిర్మించుకుని దశాబ్దాల కాలం పాటు ఉమ్మడి రాష్ట్రం తో పాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆర్టీసీ యాజమాన్యం కార్మికులకు, సం స్థకు సంబంధించిన కార్య కలాపాలను కొనసాగిస్తూ వస్తోంది. ఇందులో ఎబూ బిబూ బ్లాక్ పేర్లతో విభజించి ఎ బ్లాక్‌ను ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీకి, బీ బ్లాక్‌ను తెలంగాణ ఆర్టీసీకి కేటాయించారు.ఏపీ ఆర్టీసీ తరలివెళ్లిన తర్వాత ఏ బ్లాక్ ఖాళాగా ఉంటోంది. తెలంగాణ ప్రభు త్వం మార్చి 31న ఏ బ్లాక్‌ను జివిస్టీ, ఇన్కం ట్యాక్స్ శాఖలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా శాఖల ఉన్నతాధికారులు బస్ భవన్‌కు చేరుకుని ఏ -బ్లాక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యలను టీజీఎస్ఆర్టీసీ జేఏసీ తీవ్రంగా ఖండిస్తూ, ప్రభుత్వం విడుదల చేసిన జీవో రద్దుతో పాటు - బ్లాక్‌ను వెంటనే ఖాళీ చేయాలని డిమాండ్ చేసింది. షెడ్యూల్-9లో ఉన్నటువంటి ఉమ్మడి ఆస్తుల పంపకాలు నేటివరకు పూర్తి కానప్పటికీ, విధా న పరమైన నిర్ణయాలు ఆర్టీసి ఉమ్మడి ఆస్తుల పై జరగనప్పటికీ, అలాగే కార్పొరేషన్ ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేనప్పటికీ అధికార బలంతో ఏకపక్షంగా ఆర్టీసీ కార్యాలయాన్ని స్వాధీన పరచుకోవడం సమంజసం కాదని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం. థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి గురువారం జరిగిన సమావేశంలో అన్నారు.ఆర్టీసి ఆస్తులను కొల్లగొట్టాలనే ఆలోచనతో, ఆర్టీసిని ప్రైవేటీకరణ చేయడంలో భాగంగానే సంస్థలో ఒక్కొక్కటిగా అన్యాక్రాంతం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, దీనికి నిరసనగా ఈ నెల 7న "బస్ భవన్ బచావో" కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్టు తెలిపారు. అన్ని కార్మిక సంఘాలకు చెందిన నాయకులు, కార్మికులు తమ తమ విభేదాలు విడనాడి, ఐకమత్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే అన్ని జిల్లాలలోని డిపోలలో గేటు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు పెద్దయెత్తున నిర్వహించాలని కోరారు. సమావేశంలో జెఏసి కోశాధికారి బి.యాదయ్య, జె.రాఘవులు, ఎన్.కమలాకర్ గౌడ్, డి.గోపా ల్, బుద్ధ విశాల్, నగేష్ పటేల్, రాం చందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా సిటిజన్‌షిప్‌కు బ్రేక్ పడనుందా?

అమెరికా, అమెరికాలో పుట్టిన ప్రతి బిడ్డకు ఆటోమేటిక్‌గా పౌరసత్వం లభించే "బర్త్‌రైట్ సిటిజన్‌షిప్" అంశం ఇప్పుడు మళ్లీ ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బర్త్‌రైట్ సిటిజన్‌షిప్ ను ట్రంప్ రద్దు చేయాలని ప్రతిపాదించడం.. సుప్రీంకోర్టులో దీనికి వ్యతిరేకంగా పిటీషన్లు దాఖలు కావడంతో ఈ తీర్పు . దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయంపై ప్రస్తుతం సందిగ్ధత నెలకొంది.అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం.. అమెరికా భూభాగంలో జన్మించిన వారు ఎవరైనా.. వారి తల్లిదండ్రుల జాతీయతతో సంబంధం లేకుండా సహజ సిద్ధంగా అమెరికన్ పౌరులవుతారు. 1868లో ప్రవేశపెట్టిన ఈ చట్టం.. అమెరికాను ఒక వలసదారుల దేశంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించింది. అయితే ప్రస్తుతం మారుతున్న రాజకీయ సమీకరణాల వల్ల ఈ ప్రాథమిక హక్కుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.అమెరికాలో ఈ చర్చ మళ్లీ ఊపందుకోవడానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి అమెరికా సరిహద్దుల గుండా అక్రమంగా ప్రవేశించే వారి సంఖ్య పెరుగుతోంది. ఇలా వచ్చిన వారు అక్కడ పిల్లలకు జన్మనివ్వడం ద్వారా వారి పిల్లలకు పౌరసత్వం లభించి, తద్వారా తాము కూడా అక్కడ స్థిరపడే అవకాశం ఉంటుందని రాజకీయ విమర్శకుల వాదన. దీనినే "యాంకర్ బేబీస్" అని పిలుస్తూ కొందరు నేతలు విమర్శిస్తున్నారు. కేవలం అమెరికా పౌరసత్వం పొందడమే లక్ష్యంగా ప్రసవ సమయానికి అమెరికాకు వచ్చే విదేశీయుల సంఖ్య ముఖ్యంగా రష్యా, చైనా వంటి దేశాల నుండి పెరుగుతోందని ట్రంప్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ముఖ్యంగా రిపబ్లికన్ పార్టీకి చెందిన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వంటి నేతలు, బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌ను రద్దు చేస్తామని ఎన్నికల ప్రచారాల్లో బలంగా వినిపి స్తున్నారు. దాని అమలుకు పూనుకున్నారు. దీనివల్ల వలసలకు చెక్ పెట్టవచ్చని వారు భావిస్తున్నారు.అమెరికాలో పుట్టిన వారికి సిటిజన్‌షిప్ రాదా? అంటే దానికి సమా ధానం అంత సులభం కాదు.

## భార్య మెడను కాలుతో తొక్కి.. హత్య చేసిన బిల్డర్




బెంగళూరు: డబ్బు విషయంపై భార్యా భర్తల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన బిల్డర్ అయిన భర్త, భార్య మెడను కాలుతో తొక్కి చంపాడు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇచ్చి లొంగిపోయాడు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. నాగసాంద్ర ప్రాంతంలో నివసించే ధారియప్ప బిల్డర్. ఇంటి ఖర్చుల కోసం ఉంచిన రూ. 2 లక్షలు తన సోదరుడికి ఇవ్వాలని అతడు భావించాడు.కాగా, ఈ విషయంపై 35 ఏళ్ల భార్య కావ్య, ధారియప్ప మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన అతడు భార్యను కొట్టాడు. కిందపడిన కావ్య మెడను కాలితో బలంగా తొక్కడంతో ఆమె చనిపోయింది. ధారియప్ప తన భార్య మృతదేహం వద్ద రెండు గంటలపాటు ఉన్నాడు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఆ ఇంటికి చేరుకుని అతడ్ని అరెస్ట్ చేశారు. మరోవైపు ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీస్ అధికారి తెలిపారు. కుమారుడు పదో తరగతి, కుమార్తె ఇంటర్ చదువుతున్నట్లు చెప్పారు. ఈ సంఘటన జరిగినప్పుడు పిల్లలిద్దరూ ఇంట్లో లేరని వివరించారు. ధారియప్పపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.తల్లితో సంబంధంపై అనుమానం.. కత్తితో పొడిచి వ్యక్తిని చంపిన ఆమె కుమారుడు ఒక వ్యక్తి, తన తల్లి మధ్య సంబంధం ఉన్నదని ఆమె కుమారుడు అనుమానించాడు. వారిద్దరూ కలిసి వెళ్లడాన్ని గమనించాడు. బైక్‌పై అక్కడకు చేరుకున్నాడు. తల్లితో ఉన్న వ్యక్తిపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడు మరణించాడు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. మార్చి 27న అమన్ అనే వ్యక్తి ఒక మహిళతో కలిసి పశ్చిమ్ విహార్ నుంచి నిహాల్ విహార్ వైపు ప్రయాణించాడు.కాగా, ఆ మహిళ కుమారుడు రోహిత్ ఇది తెలుసుకున్నాడు. తన తల్లి, అమన్ మధ్య వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానించాడు. బైక్‌పై వారిని వెంబడించాడు. నిహాల్ విహార్ ప్రాంతంలో అమన్‌ను అడ్డుకున్నాడు. అతడిపై కత్తితో దాడి చేసి పలుమార్లు పొడిచాడు. ఆ తర్వాత అక్కడి నుంచి బైక్‌పై పారిపోయాడు.మరోవైపు తీవ్రంగా గాయపడిన అమన్ చికిత్స పొందుతూ మరణిం చాడు. అమన్ సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడైన మహిళ కుమారుడు రోహిత్‌ను అరెస్ట్ చేశారు. తల్లితో సంబంధం ఉన్నట్లు అనుమానించి అమన్‌ను అతడు హత్య చేశాడని పోలీస్ అధికారి తెలిపారు. నిందితుడు రోహిత్‌పై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి- అమిత్ షా



అసోం : అసోంలో వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో చొరబాటుదారులను అరికడుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. అలాగే చొరబాటుదారులను అసోం నుంచి వెనక్కి పంపుతుందని వెల్లడించారు. గిరిజన వర్గాల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఒక పెద్ద డెయిరీని ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గిరిజన కుటుంబానికి ఒక ఆవు, ఒక గేదెను ఇస్తుందని స్పష్టం చేశారు. అసోంను కాంగ్రెస్ పార్టీ చొరబాటుదారులకు అడ్డాగా మార్చిందని ఆరోపించారు. ఈ మేరకు అసోంలోని గోల్పారాలో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా వ్యాఖ్యానించారు."కాంగ్రెస్ అసోంను చొరబాటుదారులకు కేంద్రంగా మార్చింది. వారి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిరిజన ప్రాంతాల్లోకి కూడా చొరబాటుదారులు వస్తారు. వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చొరబాటుదారులను ఎంపిక చేసి వెనక్కి పంపుతుంది. చొరబాటుదారులందరినీ గుర్తించాం. ప్రస్తుతం సమయం కొంచెం తక్కువగా ఉంది. మాకు ఐదేళ్ల సమయం ఇవ్వండి. మేము గుర్తించిన చొరబాటుదారులను దేశం నుంచి వెళ్లగొడతాం. కాంగ్రెస్ పాలనలో గిరిజన సమాజ అభివృద్ధికి కేటాయించిన బడ్జెట్ రూ. 25,000 కోట్లు. నరేంద్ర మోదీ ప్రభుత్వం దాన్ని రూ. 1.38లక్షల కోట్లకు పెంచింది" అని అమిత్ షా పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమం గురించి కాంగ్రెస్ మాట్లాడదు : అమిత్ షాకాంగ్రెస్ పదేపదే ఎన్నికల్లో పోటీ చేయడానికి అసోంకు వస్తుందని, కానీ ఇక్కడి గిరిజనుల సంక్షేమం గురించి ఒక్కసారి కూడా మాట్లాడలేదని అమిత్ షా ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచాయని, కానీ వారు (కాంగ్రెస్) ఒక్క గిరిజన మహిళనూ రాష్ట్రపతిని చేయలేదని అన్నారు. కేవలం ప్రధాని మోదీ మాత్రమే గిరిజన సోదరి ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేశారని వెల్లడించారు ."దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన వర్గాల కళ, సంస్కృతి, వంటకాలు, వస్త్రధారణ, సంగీతం, నృత్యాలను ప్రధాని మోదీ ప్రపంచ వేదికపై ప్రోత్సహించారు. ఈ దుధ్నోయ్ నదిని పాల నది అని పిలుస్తారు. అందుకే దీనికి దుధ్నోయ్ అనే పేరు వచ్చింది. ఇక్కడ ఒక్క డెయిరీ అయినా ఉందా?. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అసోంలో ప్రతి జిల్లాలోనూ ఒక డెయిరీని ఏర్పాటు చేస్తుంది. అలాగే ప్రతి గిరిజన కుటుంబానికి ఒక ఆవు, ఒక గేదెను అందిస్తుంది" అని అమిత్ షా స్పష్టం చేశారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం దేశ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేసిందని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. అలాగే ఎన్‌డీఏ సర్కార్ సేవా దృక్పథంతో వివక్ష లేని పాలనా ప్రయోజనాలను దేశంలోని ప్రతి పౌరుడికి అందించడానికి కృషి చేస్తోందన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం గత పదేళ్లలో అసోం పునరుజ్జీవాన్ని సాకారం చేయడానికి తన నిబద్ధతను చాటుకుందని చెప్పారు. కాంగ్రెస్ తన పాలనలో అసోంలో అరాచకత్వం, అల్లర్లు, చొరబాట్లను ప్రోత్సహించిందని ఆరోపించారు. తద్వారా అసోంలో పౌరుల భద్రతకు ఆటంకం కలిగించిందని మండిపడ్డారు. బార్పేటలో జరిగిన బహిరంగ సభలో యోగి పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. అసోంకు దక్కాల్సిన హక్కులు దక్కేలా చూడటానికి తాము పోరాడుతామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కామరూప్‌లో జరిగిన బహిరంగ సభలో వ్యాఖ్యానించారు. ఆనాటి కాంగ్రెస్ సర్కార్ అక్రమంగా చొరబాటుదారులకు అప్పగించిన భూములను తిరిగి అసోం ప్రజలకు అప్పగించడానికి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని ఎన్‌డీఏ సర్కార్ కృషి చేసిందని కొనియాడారు. అసోంలోని ప్రతి నియోజకవర్గంలోనూ ప్రజలు తమను ఆశీర్వదిస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి పవిత్ర మార్గరీటా తెలిపారు. వరుసగా మూడోసారి ఎన్‌డీఏ ప్రభుత్వమే అధికారం చేపట్టబోతోందని తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. నజీరా నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి మయూర్ బోర్గొహైన్ కనీసం 30,000 ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తారని అంచనా వేశారు. కాగా, అసోంలో ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికల పోలింగ్ జరగనుంది. మే 4న ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. అధికార ఎన్‌డీఏ హ్యాట్రిక్ కొట్టేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోంది. పదేళ్ల తర్వాత అధికారాన్ని చేజిక్కించుకునేందుకు విపక్ష కాంగ్రెస్ కూటమి సర్వశక్తులు ఒడ్డుతోంది.

# నాగచైతన్యను భిన్నంగా నిలిపేది అదే..



టాప్ స్టార్ల వారసులుగా ఇండస్ట్రీలోకి వచ్చే వాళ్ల మీద భారీ అంచనాలు ఉంటాయి. ఆ అంచనాలను అందుకోవడానికి, స్టార్ ఇమేజ్ పెంచుకోవడానికి వారసత్వ హీరోలు ఎక్కువగా మాస్ సినిమాలు చేయడం, ఎలివేషన్ల కోసం ప్రయత్నించడం చూస్తుంటారు. ప్రతిదీ అభిమానులను దృష్టిలో ఉంచుకునే చేస్తుంటారు. కానీ అక్కినేని కుర్రాడు నాగచైతన్య మాత్రం ఇందుకు భిన్నం. అతను ఎప్పుడూ ఇమేజ్ ఛట్రంలో ఇరుక్కుపోలేదు. ఎక్కువగా ప్రేమకథా చిత్రాలు, క్లాస్ మూవీస్‌తోనే హిట్లు కొట్టాడు. మాస్ సినిమాలు అప్పుడప్పుడూ ట్రై చేసినా పెద్దగా ఫలితం రాలేదు. కానీ అతను ఆ ఇమేజ్ కోసం వెంపర్లాడలేదు. తన సినిమాల్లో కూడా ఎలివేషన్లు, ఫైట్లు, డ్యాన్సులు అని లెక్కలేసుకుని ఫార్ములా సినిమాలు చేయలేదు. బయట కూడా అతను పెద్దగా బిల్డప్‌లు ఇవ్వడు. ఎంతో అణకువతో వ్యవహరిస్తుంటాడు. తన సినిమాల్లో కథను బట్టి వెళ్లిపోతాడే తప్ప.. ఇమేజ్ లెక్కలు వేసుకోడని పలుమార్లు రుజువైంది. తాజాగా తన నుంచి రాబోతున్న 'వృషకర్మ' విషయంలో చైతూ ఇంకా బోల్డ్ స్టెప్ వేస్తున్నాడని అర్థమవుతోంది. గురువారం రిలీజైన 'వృషకర్మ' టీజర్లో.. నాగచైతన్య పాత్రను బాగా అండర్ ప్లే చేశారు. టీజర్లో కాన్సెప్ట్‌ను, విలన్‌ను హైలైట్ చేయడానికే చూశారు. టీజర్ మొదలైంది విలన్ పాత్ర మీదే. సగం వరకు అతనే హైలైట్ అయ్యాడు. తర్వాత చైతూ రంగంలోకి దిగాడు. అప్పుడు కూడా చైతూకు, తన పాత్రకు మరీ బిల్డప్ ఏమీ ఇవ్వలేదు. మొత్తంగా టీజర్లో కాన్సెప్ట్, విలన్ క్యారెక్టర్, విజువల్స్, కథా నేపథ్యాన్ని చూపించే వరల్డ్ హైలైట్ అయ్యాయి తప్ప.. చైతూ మీదికి ఎక్కువ ఫోకస్ వెళ్లలేదు. ఇదే విషయమై చైతూను అడిగితే.. తాను దర్శకుడు కార్తీక్ దండు విజన్‌ను నమ్మి అందుకు తగ్గట్లుగా ముందుకు వెళ్లిపోయానని.. తాను హైలైట్ కావాలని అనుకోలేదని చెప్పాడు. అలా లెక్కలేసుకుని చేసిన సినిమాల విషయంలో కొన్నిసార్లే విజయవంతం అయ్యారని.. చాలాసార్లు ప్రతికూల ఫలితాలే వచ్చాయని.. కాబట్టి కథకు ఏది అవసరమో అది చేయడమే తనకు ముఖ్యం అని.. అందుకే తన గురించి ఆలోచించలేదని చెప్పాడు. చైతూ మిగతా హీరోలకు భిన్నం అనడానికి ఇది ఉదాహరణ. ఈ విషయంలో అతడిపై ప్రశంసలు కురుస్తున్నాయి.

## పారా నార్మల్ టాక్స్ వెనుక అసలు విషయం

హైదరాబాద్, హైదరాబాద్ నగరం ఇప్పుడు వినూత్న ఆలోచనలకు అడ్డాగా మారుతోంది. దెయ్యాలు, ఆత్మలు, పారా నార్మల్ శక్తుల గురించి కేవలం సినిమాల్లో చూడటమే కాదు, వాటి గురించి నేరుగా చర్చించుకునే సరికొత్త వేదికలు నగరంలో వెలుస్తున్నాయి. 'పారా నార్మల్ టాక్స్' పేరుతో జరుగుతున్న ఈ ఈవెంట్లు యువతను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. భయం కంటే కూడా ఆలోచనను రేకెత్తించే ఈ చర్చల వెనుక ఉన్న అసలు కథేంటో, ఈ వీకెండ్ ట్రెండ్ విశేషాలేంటో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. రోటీన్ లైఫ్‌కు భిన్నంగా ఏదైనా కొత్తగా చేయాలనుకునే వారి కోసం పుట్టిందే ఈ 'పారా నార్మల్ టాక్స్'. దెయ్యాలు ఉన్నాయని నమ్మే వారు, అసలు ఉండవని వాదించే వారు, లేదా ఏదో తెలియని అనుభూతిని ఎదుర్కొన్న వారు ఒకచోట చేరి తమ అనుభవాలను పంచుకోవడమే దీని ముఖ్య ఉద్దేశం. ముంబయి, బెంగళూరు వంటి నగరాల్లో ఇప్పటికే ఫేమస్ అయిన ఈ ట్రెండ్, ఈ ఏడాది జనవరి నుంచి హైదరాబాద్‌కు కూడా పాకింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి ఏరియాల్లో ఈ తరహా ఈవెంట్లు ఇప్పుడు హాట్ టాపిక్ అవుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు ఆలోచనను రేకెత్తించే రాత్రి అని పిలుస్తున్నారు. ఇక్కడ కేవలం భయపెట్టే కథలు చెప్పడం మాత్రమే కాదు, ఆయా సంఘటనల వెనుక ఉన్న లాజిక్ లేదా సైన్స్ మిస్టరీని చర్చించడం ప్రధానాంశం. ఈ ఈవెంట్లలో పాల్గొనాలంటే కనీసం 18 ఏళ్లు నిండి ఉండాలని నిర్వాహకులు నిబంధన పెట్టారు. ఇక తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మాట్లాడుకునే సౌలభ్యం ఉండటంతో విభిన్న నేపథ్యాలు ఉన్న వారు ఇక్కడికి వచ్చి తమ మనసులోని సందేహాలను, భయాలను క్లియర్ చేసుకుంటున్నారు. సాధారణంగా ఈ ప్రోగ్రామ్స్ అన్నీ వీకెండ్స్‌లోనే జరుగుతున్నాయి. గంట పాటు సాగే ఈ చర్చా వేదికను ఒక్కోసారి ఇండోర్ హాల్స్‌లో, మరికొన్ని సార్లు ఓపెన్ ప్లేస్‌లలో ఏర్పాటు చేస్తున్నారు. ఇక హైటెక్ సిటీ, మాదాపూర్ ప్రాంతాల్లోని ఐటీ ఉద్యోగులు కూడా ఈ సరికొత్త ట్రెండ్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా, ఒక పద్ధతి ప్రకారం జరిగే ఈ చర్చల్లో పాల్గొనే వారు తమ నిజ జీవితంలో ఎదురైన చిత్ర విచిత్రమైన సంఘటనలను ఇక్కడి వారితో షేర్ చేసుకుంటారు. ఈ పారా నార్మల్ థీమ్‌కు ఇటీవల కాలంలో ఆదరణ విపరీతంగా పెరుగుతోంది. ఎవరి ఐడియాలజీ వారికి ఉన్నప్పటికీ, కొత్త విషయాలను తెలుసుకోవాలనే కుతూహలం అందరినీ ఇక్కడికి రప్పిస్తోంది. పరిస్థితులకు తగ్గట్లుగా సీటింగ్ లేదా స్టాండింగ్ అరేంజ్మెంట్స్‌తో ఈ ఈవెంట్లు జరుగుతున్నాయి. ఇక తమకు ఎదురైన అనుభవాలను ఇతరులు ఎలా రిసీవ్ చేసుకుంటారో తెలుసుకోవడం, అలాగే ఇతరుల కథల ద్వారా కొత్త కోణాలను అర్థం చేసుకోవడం ఇక్కడ కనిపిస్తున్న ప్రధాన మార్పు.

# ప్రధానమంత్రి మోదీ భారీ రోడ్‌షో..



పుదుచ్చేరి: జాతీయ ప్రజాస్వామ్య కూటమికి మద్దతు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుదుచ్చేరి లో భారీ రోడ్‌షో నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి, పాండిచ్చేరి హోం మంత్రి ఎ.నమశ్శివాయం సైతం ఈ రోడ్‌షోలో పాల్గొన్నారు. అజంతా సిగ్నల్ పాయింట్, కామరాజ్ విగ్రహం–రాజా థియేటర్ సిగ్నల్ మధ్య సుమారు రెండు కిలోమీటర్ల మేర గంటసేపు రోడ్‌షో జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు, సాంప్రదాయ నృత్యాలు ముందుకు సాగగా, బీజేపీ కార్యకర్తలు, అల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్‌సీ) కార్యకర్తలు పార్టీ జెండాలతో పెద్దఎత్తున పాల్గొన్నారు. దీనికి ముందు, పుదుచ్చేరి చేరుకున్న ప్రధానమంత్రికి బీజేపీ మద్దతుదారులు ఘనస్వాగతం పలికారు. 'జైశ్రీరామ్' 'భారత్ మాతా కీ జై' నినాదులు హోరెత్తించారు. ప్రధాన కాన్వాయ్‌పై పూలజల్లులు కురిపించారు. పుదుచ్చేరిలో ఏఐఎన్ఆర్‌సీ– బీజేపీ కూటమి మరోసారి అధికారం లోకి వచ్చేందుకు విస్తృత ప్రచారం సాగిస్తున్న తరుణంలో మోదీ రోడ్‌షోతో ప్రచారం మరింత ఊపందుకుంది. ఇటీవల పుదుచ్చేరి బీజేపీ కార్యకర్తలతో వర్చువల్ షోలోనూ మోదీ పాల్గొని వారిని మరింత ఉత్సాహపరిచారు. ఈ ఎన్నికల్లో సీట్ల పంపకాల్లో భాగంగా ఏఐఎన్ఆర్‌సీ 16 స్థానాల్లోనూ, బీజేపీ 10 స్థానాల్లోనూ పోటీ చేస్తున్నాయి. కూటమిలో ఇతర భాగస్వాములుగా ఉన్న అన్నాడీఎంకే, లాట్చియ జననాయగ కట్చి (ఎల్‌జేకే) చెరో రెండు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. పుదుచ్చేరి అసెంబ్లీకి ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# అసలే ఫ్లాప్ సినిమా... మళ్లీ రెంట్‌కా?



సూపర్ స్టార్ రజనీకాంత్ స్పెషల్ అప్పియరెన్స్‌లో తెరకెక్కిన 'లాల్ సలామ్' సినిమా హిందీ వెర్షన్ మరో ఓటీటీలోకి వచ్చింది. ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2024లో విడుదలైనప్పుడు బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని అందుకుంది. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ హిందీ వెర్షన్ అందుబాటులోకి రాగా, దీనిని చూడాలంటే అదనంగా రెంట్ చెల్లించాలనే నిబంధన పెట్టారు. అసలే ఫ్లాప్ అయిన సినిమాను, అదీ ఇంత కాలం తర్వాత మళ్లీ డబ్బులు పెట్టి చూస్తారా అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. క్రీడలు, మత సామరస్యం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రలు పోషించారు. రజనీకాంత్ 'మొయిదీన్ భాయ్' అనే పవర్‌ఫుల్ రోల్‌లో మెరిసినా, కథలో పట్టు లేకపోవడంతో ప్రేక్షకులు ఈ చిత్రాన్ని తిరస్కరించారు. అప్పట్లో ఈ మూవీ కనీసం వసూళ్లను కూడా రాబట్టలేకపోయింది. అటువంటి సినిమాను ఇప్పుడు హిందీ ఆడియన్స్ కోసం రెంట్ పద్ధతిలో తీసుకురావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఫ్రీగా ఇస్తేనే చూసే పరిస్థితి లేని ఈ సినిమాకు రెంట్ అంటే సాహసమే అని చెప్పాలి. ఏఆర్ రెహమాన్ సంగీతం, కపిల్ దేవ్ గెస్ట్ రోల్ వంటి ఆకర్షణలు ఉన్నప్పటికీ ఈ చిత్రం ఎందుకో ఆడియన్స్‌కు కనెక్ట్ కాలేదు. క్రికెట్ నేపథ్యం ఉన్న సినిమాలకు మన దగ్గర మంచి ఆదరణ ఉంటుంది, కానీ ఇందులో మతపరమైన అంశాలు ఎక్కువగా ఉండటం వల్ల కొంత వివాదాస్పదంగా మారింది. మేకింగ్ పరంగా కూడా ఐశ్వర్య రజనీకాంత్ విఫలమయ్యారనే విమర్శలు వచ్చాయి. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ మూవీ రజనీ కెరీర్‌లో ఒక డిజాస్టర్‌గా నిలిచిపోయింది. ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ రెంట్ విధానాన్ని ఎక్కువగా ప్రోత్సహిస్తున్నాయి. సబ్‌స్క్రిప్షన్ ఉన్నా కూడా కొన్ని కొత్త లేదా పాత పెద్ద సినిమాలకు విడిగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. అయితే 'లాల్ సలామ్' లాంటి ఫ్లాప్ సినిమాలకు ఈ విధానం ఎంతవరకు వర్కవుట్ అవుతుందనేది ప్రశ్నార్థకమే. ఇప్పటికే యూట్యూబ్ లేదా ఇతర సోషల్ మీడియాలో ఈ సినిమా క్లిప్పింగ్స్ అందుబాటులో ఉన్నాయి. మరి అలాంటప్పుడు హిందీ ప్రేక్షకులు మళ్లీ దీని కోసం ఖర్చు పెడతారా అనేది చూడాలి.

## సైబర్ క్రైమ్ కేసులో ముగ్గురి అరెస్టు..

ఖమ్మం : సత్తుపల్లి సైబర్ నేరాల కేసు మరో కీలక మలుపు తిరిగింది. ఈ కేసుకు సంబంధించి మరో ముగ్గురు బ్యాంక్ ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ కేసులో సీఆర్‌వోలు ఓర్సు కృప, మంద శ్రీహరిబాబు, బీఆర్‌వో జుంజునూరి రాధాకృష్ణను సత్తుపల్లి సీఐ శ్రీహరి అరెస్టు చేశారు. ఈ కేసులో ఉడతనేని వికాస్ చౌదరి, బొప్పన నాగప్రియ, చంద్రుగొండకు చెందిన బ్యాంక్ మేనేజర్ అఖిల్ అబ్దుల్ ఇప్పటికే అరెస్టయిన సంగతి తెలిసిందే. అయితే, విచారణ సందర్భంగా తాజాగా అరెస్టయిన ముగ్గురు నిందితులు వారికి సహకరించినట్లు తేలింది. ఈ మేరకు ఓర్సు కృప, మంద శ్రీహరి బాబు, బీఆర్‌వో జుంజునూరి రాధాకృష్ణను సీఐ శ్రీహరి అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. కాగా, రూ. 549.95 కోట్లు దోచుకున్న కేసులో వీరిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులంతా అంతర్జాతీయ సైబర్ నేరస్థులతో చేతులు కలిపినట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. షేర్ మార్కెట్లలో పెట్టుబడులు, బెట్టింగ్, మ్యాట్రిమోనీ, రివార్డు పాయింట్లు, గేమింగ్, క్రిప్టో కరెన్సీ వంటి మోసాలకు నిందితులు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి 24 మందిపై కేసు నమోదు కాగా ఇప్పటికే చాలా మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు పోలీసులు.

# ప్రజలను మోసం చేసే ప్రయత్నం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్: కేరళంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని, కావాలంటే కేరళ ప్రజలు వచ్చి చూడాలని చెప్పడం విడ్డూరం ఉందని అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు తెలంగాణలో పూర్తిగా విఫలమయ్యాయని.. ఒక్క పథకం కూడా సమర్థవంతంగా అమలు కాలేదన్నారు. అమలు చేయని పథకాలను అమలు చేసినట్టు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. ఇది సాధారణ అబద్ధం కాదని.. ప్రజలను మోసం చేసే ప్రయత్నమని కిషన్ రెడ్డి ఆగ్రహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ..' మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పారు, ఇచ్చారా?. పెన్షన్లు రూ.2,000 నుంచి రూ.4,000 చేస్తామని, దివ్యాంగులకు రూ.3,000 నుంచి రూ.6,000 చేస్తామని చెప్పారు, అమలు చేశారా?. దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు.. ఇచ్చారా?. బీసీలకు రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పారు.. రెండు సంవత్సరాల పాలనలో ఒక్క ఏడాది కూడా రూ.20 వేల కోట్లు ఇవ్వలేకపోయారు. ఇవన్నీ కేరళ ప్రజలకు చెప్పగలరా?. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయకపోవడం మోసమైతే.. అమలు చేశామని చెప్పడం మరింత పెద్ద మోసం. తప్పుడు ప్రచారం, అబద్ధాలు చెప్పడం ప్రజలను దగా చేయడమే. తెలంగాణలో పెళ్లయిన ఆడబిడ్డలకు తులం బంగారం ఎక్కడ?. ఉచిత ఎలక్ట్రిక్ స్కూటర్లు ఎక్కడ?. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?. నిరుద్యోగ భృతి ఎక్కడ?. ఈ హామీలన్నీ ఎక్కడికి పోయాయి.

# విచిత్ర రాజకీయ ప్రదర్శనగా మారిన కేరళ ఎన్నికల ప్రచారం

కేరళ, కేరళ ఎన్నికల ప్రచారం ఈసారి ఒక అసాధారణ, విచిత్ర రాజకీయ ప్రదర్శనగా మారింది. విధానాలు, అభివృద్ధి నమూనాలు, ప్రజా సమస్యలపై సీరియస్ చర్చలు జరగాల్సిన వేదిక.. ఇప్పుడు "వింత సూత్రీకరణల సర్కస్"గా మారిపోవడం విస్తుగొలుపుతోంది. ఈ సర్కస్‌లో పుట్టిన తాజా సూత్రం "ఎల్డీఎఫ్‌బీజేపీ రెండూ ఒకటే!" ఈ మహత్తర సూత్రా విష్కరణకు శిల్పులుగా నిలిచిన రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి గార్లు, రాజకీయ తత్వశాస్త్రానికే కొత్త నిర్వచనం రాస్తున్నామన్న భ్రమల్లో ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతున్నారు. మార్క్స్ నుంచి లెనిన్ వరకు, అంబేద్కర్ నుంచి మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వరకు.. మహామహులెవరికీ సాధ్యం కాని రీతిలో "విరుద్ధాలను సమానాలుగా" ప్రకటించే వీరి "వింత గణితం" నిజంగా ఆశ్చర్యమే! ఆశ్చర్యమే కాదు, వారి అల్పత్వానికీ నిదర్శనం. వీరి రాజకీయ గణిత సూత్రం ప్రకారం.. అగ్గి రాజేసినవాడూ, దాన్ని ఆర్పేవాడూ ఒకటేనట. ఇదే ఈ కొత్త రాజకీయ తర్కం! ఈ తర్కాన్ని ఇంకాస్త సూటిగా చెప్పాలంటే, "ఎల్డీఎఫ్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే" అన్న నినాదంగా మార్చేశారు. అంతటితో ఆగకుండా ఈ వింత గణితాన్ని వ్యక్తులకూ విస్తరించి "మోదీకి విజయన్‌కు తేడాలేదు" అనేదాకా చేరుకున్నారు. ఇదివింటే నవ్వొస్తుంది, కానీ విచిత్రంగా ఇదే ఇప్పుడు తీవ్రమైన రాజకీయ వాదనగా వినిపిస్తోంది. ఒకవైపు బీజేపీని మత రాజకీయాల కేంద్రంగా చూపిస్తూ, మరోవైపు ఆ రాజకీయాలకు వ్యతిరేకంగా నిరంతరం నిబద్ధతతో పోరాడుతున్న ఎల్డీఎఫ్‌ను కూడా అదే గాడిన కట్టడం అంటే, వాస్తవానికి అద్దం పట్టడం కాదు, అద్దాన్నే వంకరగా తిప్పడం. ఈ వంకర అద్దంలో చూస్తే నిజం కూడా అబద్ధంలా కనిపిస్తుంది. బహుశా అదే వీరి సరికొత్త రాజకీయ గణితశాస్త్ర పరమార్థం కాబోలు! రాహుల్‌గాంధీ గారైనా, రేవంత్‌రెడ్డి గారైనా చెప్పే ఈ "ఎల్డీఎఫ్ -- బీజేపీ" సమీకరణం, వాస్తవానికి వారి రాజకీయ బలహీనతను దాచుకునే ఒక దిగజారుడు వ్యూహం మాత్రమే. ఎందుకంటే కేరళలో ఎల్డీఎఫ్ నిర్మించిన అభివృద్ధి నమూనాను.. విద్య, వైద్యం, సామాజిక భద్రత, స్థానిక ఆర్థిక వ్యవస్థలలో సాధించిన ప్రగతిని చర్చించడానికి వారు సిద్ధంగా లేరు, చర్చించి గెలవలేరు కూడా. అందుకే ఈ విధమైన వక్రీకరణలకు పాల్పడుతున్నారు. ఈ సూత్రీకరణను నిజంగానే అంగీకరిస్తే, దాని తుదిఫలితం ప్రమాదకరంగా ఉంటుంది. మతతత్వాన్ని ప్రోత్సహించే శక్తి, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడే శక్తి, ఈ రెండూ ఒకటే అయితే, ఇక రాజకీయ విధానాలకే అర్థం ఉండదు. పోరాటాలకు విలువ ఉండదు. సిద్ధాంతాలకు ప్రాముఖ్యత ఉండదు. అందువల్ల ఇది కేవలం ఒక తప్పుడు పోలిక మాత్రమే కాదు, ఒక చారిత్రక సత్యాన్ని అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ 'మహామేధావుల' వైఫల్యం. లేదంటే ఆ సత్యాన్నే చెరిపేయాలనే ప్రమాదకర ప్రయత్నం. అంతిమంగా ఇది ఎవరికి లాభం? నిస్సందేహంగా బీజేపీకే లాభం. ఎందుకంటే, ప్రత్యామ్నాయాన్ని మసకబారిస్తే ప్రజలముందు ఎంపికలే మాయమవుతాయి. కానీ, ప్రజాస్వామ్యంలో ఈ తప్పుడు వాదనలు ఎప్పటికీ నిలబడవు. ఎందుకంటే.. రెండు పరస్పర వ్యతిరేక ధ్రువాలను ఒకటిగా చూపడం తర్కం కాదు, మోసం.

